సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం । 14 । జూలై । 2025



ఘనంగా ఆషాఢ బోనాలు

జిల్లాలో ఆదివారం ఆషాఢ బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్లతో ఊరేగింపులు నిర్వహించారు. అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. చల్లంగా చూడాలని వేడుకున్నారు. 9లో

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి విశేష పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచీ కూడా వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అమ్మవారికి భక్తులు అన్నప్రాసనలు, ఒడి బియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

ప్రశాంతంగా 'అండర్ మేనేజర్' పరీక్ష



పరీక్షకు హాజరైన సింగరేణి ఉద్యోగులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న 33 అండర్ మేనేజర్ పోస్టులకు ఆదివారం సింగరేణి మహిళా కళాశాలలో రాత పరీక్ష నిర్వహించారు. ఇంటర్నల్ అభ్యర్థులతో భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా, 234 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 217 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని సింగరేణి ఎడ్యుకేషన్ జీఎం బి.నికోలస్ పర్యవేక్షించారు. సింగరేణి విజిలెన్స్, సెక్యూరిటీ, రిక్రూట్‌మెంట్ సెల్ సిబ్బంది, కళాశాల ప్రిన్సిపల్ శారద పాల్గొన్నారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి



కిన్నెరసాని జలాశయంలో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో తరలివచ్చారు. డ్యామ్, జలాశయం, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా గడిపారు. 717 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా వైల్డ్ లైఫ్ శాఖకు రూ.38,115 ఆదాయం లభించింది. 450మంది బోటు షికారు చేయగా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.22,330 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు కొత్త పరికరాలు

ఖమ్మంమయూరిసెంటర్ : జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు కొత్త పరికరాలు చేరుకున్నాయి. డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్‌లో స్లాట్ విధానం అమలు చేస్తుండడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగంగా ముగించేలా కొత్త కంప్యూటర్‌లు, స్కానర్‌లు, బయోమెట్రిక్ డివైజ్‌లను అందజేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఈ పరికరాలు వచ్చాయి. పాత వాటితో రిజిస్ట్రేషన్లు ఆలస్యమవుతుండగా కొత్త పరికరాలు సరఫరా చేశారని, వాటిని ఆయా కార్యాలయాల్లో అమర్చామని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు వెల్లడించారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ

- రజత పతకం సాధించిన మల్లెమడుగు విద్యార్థినులు

ఖమ్మంఅర్బన్ : మంచిర్యాల జిల్లా రామకృష్టాపురంలో ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో మల్లెమడుగు ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాట్లారు. కె.అనిత, టి. నవ్యశ్రీ రజత పతకం సాధించారు. గతేడాది వనపర్తిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లోనూ అనిత కాంస్య పతకం సాధించిందని, హైదరాబాద్‌లో జరిగిన సీఎం కప్ పోటీల్లో స్వర్ణ పతకం గెలుచుకుందని ప్రధానోపాధ్యాయురాలు జి.కృష్ణవేణి, పీడీ బియ్యని కృష్ణయ్య వివరించారు. కాగా, ఈ విద్యార్థినులను ఎంఈఓ శైలజలక్ష్మి తదితరులు అభినందించారు.

పొంచి ఉన్న ముంపు ముప్పు

పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌తో భద్రాచలంలో భయం.. భయం

- మేడిగడ్డ బరాజ్‌తోనూ తప్పదని మంత్రి ఉత్తమ్ ప్రకటన
- పోలవరం ప్రభావంపై హైదరాబాద్ ఐఐటీ బృందంతో సర్వే
- ఎగువ బరాజ్‌ల ప్రభావంపైనా సర్వే చేయాలని డిమాండ్లు



భద్రాచలం వద్ద గోదావరిలో వరద ఉధృతి(ఫైల్)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: పోలవరం ప్రాజెక్ట్ ముంపుపై స్పష్టమైన అంచనాలు బయటకు రాకముందే మేడిగడ్డ బరాజ్‌తోనూ భద్రాచలం ప్రాంతానికి ప్రమాదమని రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించడం సంచలనంగా మారింది. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ పనులు ఆరంభించే సమయంలో సెంట్రల్ వాటర్ కమిషన్ 2016లో గోదావరి బ్యాక్ వాటర్ వల్ల కలిగే ముంపు సమస్యపై అధ్యయనం చేసింది. ప్రాజెక్టులో 45.72 మీటర్ల మేర నీటిని గరిష్ట స్థాయిలో నిల్వ చేస్తే గోదావరి ఎగువ భాగంలో ఏ మేరకు ప్రభావం ఉంటుందనే వివరాలను ఇందులో పేర్కొన్నారు. ఇప్పటివరకు పోలవరం బ్యాక్ వాటర్‌కు సంబంధించి ఈ నివేదికే ప్రామాణికంగా ఉంది. దీని ప్రకారం పోలవరం డ్యామ్ దగ్గర 45 అడుగుల మేర నీరు నిలిచినా భద్రాచలం పట్టణంతోపాటు ఎగువన ఉన్న బూర్గంపాడు, దుమ్ముగూడెం, చర్ల మండలాలకు ముంపు భయం ఉండదని పేర్కొంది. కానీ 2022 జూలైలో వచ్చిన భారీ వరద సీడబ్ల్యూసీ అంచనాలను తారుమారు చేసింది.

సందేహాలకు తావిచ్చేలా..

మూడేళ్ల క్రితం 2022, జూలై 16న అర్ధరాత్రి 27 లక్షల క్యూసెక్కుల వరద ఉధృతి ఉండగా, భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 71.30 అడుగులకు చేరుకుంది. కరకట్ట ఎత్తు 80 అడుగులు కావడంతో దాదాపుగా అంచుల దగ్గర వరకు అన్నట్టుగా వరద పోటెత్తింది. ఎటపాక దగ్గరయితే కరకట్ట మీద నుంచి నీళ్లు ఊళ్లోకి రావడం మొదలైంది. దీంతో ఏ క్షణమైనా కరకట్ట తెగిపోయి భద్రాచలం జలమయం అవుతుందా అనే భయాలు నెలకొన్నాయి. ఆ తర్వాత వరద తగ్గుముఖం పట్టడంతో ప్రమాదం తప్పింది. సాధారణంగా గోదావరికి వరద ఎంత వేగంగా పెరుగుతుందో అంతే వేగంగా తగ్గిపోతుంది. కానీ 2022లో 71 అడుగుల గరిష్ట స్థాయికి చేరుకున్న వరద తిరిగి 51 అడుగుల స్థాయికి చేరుకునేందుకు రెండున్నర రోజుల సమయం పట్టింది. పోలవరం డ్యామ్ కారణంగానే వరద వెనక్కి తగ్గడంలో ఆలస్యమైందనే సందేహాలు వ్యక్తమయ్యాయి. దీంతో పోలవరం – భద్రాచలం ముంపు అంశం మరోసారి తెరపైకి వచ్చింది.

పోలవరం అథారిటీ దృష్టికి..

గోదావరిపై నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్ట్ కారణంగా తెలంగాణలో 103 గ్రామాల్లో 954 ఎకరాలు, 16 వేలకు పైగా ఇళ్లు ముంపునకు గురవుతున్నాయంటూ పోలవరం అథారిటీ దృష్టికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకెళ్లింది. దీనిపై ఏపీ అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ముంపు కేవలం 200 ఎకరాల లోపే ఉంటుందని వాదించింది. చివరకు ముంపుపై జాయింట్ సర్వే చేపట్టాలని ఈ ఏడాది మార్చిలో నిర్ణయించారు. ఓవైపు వాదనలు సాగుతుండగానే ముంపు ప్రభావం తెలుసుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆసక్తి చూపించారు. తెలంగాణపై పోలవరం ముంపు ప్రభావాన్ని అంచనా వేసి సమగ్ర నివేదిక తయారు చేసే బాధ్యతను హైదరాబాద్ ఐఐటీకి అప్పగించారు. జనవరి 4న ఆదేశాలు జారీ చేస్తూ ఫిబ్రవరి చివరి నాటికి నివేదిక రావాలంటూ గడువు విధించారు.

ఆలస్యంగానైనా వస్తున్నారు..

సీఎం ఆదేశాల మేరకు ఐఐటీ బృందం వచ్చే వారం పది రోజుల్లో క్షేత్రస్థాయిలో పరిశీలనకు వచ్చే అవకాశం ఉంది. ఈ పర్యటనకు సంబంధించిన ఖర్చుల నిమిత్తం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ.19 లక్షలు మంజూరు చేసింది. ఈ ఏడాది జనవరిలో సీఎం నుంచి ఆదేశాలు వచ్చాక ఐఐటీ నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసింది. గతంలో వచ్చిన భారీ వరదలు, వాటి తాలూకు ప్రభావం తదితర వివరాల కోసం సీడబ్ల్యూసీ, రాష్ట్ర ఇరిగేషన్ శాఖల దగ్గరున్న రిపోర్టులను సదరు కమిటీ అధ్యయనం చేసింది. చివరగా క్షేత్రస్థాయిలో పరిశీలనకు రానుంది. భద్రాచలానికి దిగువన ఉన్న పోలవరంతోపాటు ఎగువన ఉన్న మేడిగడ్డ, సమ్మక్క సాగర్ బరాజ్‌ల వల్ల భద్రాచలం పట్టణానికి ఉండే ముప్పు, వాటిని సమర్థంగా ఎదుర్కొనే అంశాలపై హైదరాబాద్ ఐఐటీ బృందం దృష్టి సారించాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

3,500 ఇన్.. 3,390 అవుట్

- ఇటీవల కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేసిన ప్రభుత్వం
- బియ్యం తీసుకోని, ఇతర రాష్ట్రాల్లో ఉంటున్నవారివి రద్దు
- ఆందోళన చెందుతున్న రద్దయిన రేషన్‌కార్డుదారులు



రేషన్‌కార్డులు (ఫైల్)

కొత్తగూడెంఅర్బన్: అర్హులకు రేషన్ కార్డుల జారీ ప్రక్రియ కొనసాగుతోంది. మరోవైపు సర్వే నిర్వహించి కొందరి రేషన్ కార్డులను ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో రద్దైన లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం గత మార్చి నుంచి సన్న బియ్యం పంపిణీ చేస్తోంది. ఈ నేపథ్యంలో గతంలో బియ్యం తీసుకోనివారు కూడా రేషన్ షాపుల వద్దకు వచ్చి క్యూలో నిలబడి బియ్యం తీసుకెళ్తున్నారు. సన్నబియ్యం పంపిణీ చేస్తున్నా ఇంకా కొందరు రేషన్ బియ్యం తీసుకోనివారు ఉన్నారు. ఫలితంగా రేషన్ షాపుల్లో బియ్యం మిగిలి, బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్నాయి. దీనికి చెక్ పెట్టేందుకు సివిల్ సప్లయీస్ అధికారులు రెవెన్యూ శాఖ సహకారంతో సర్వే నిర్వహించారు. చాలా మంది రేషన్‌కార్డులు కలిగి ఉండి, బియ్యం తీసుకోవడం లేదని సర్వేలో తేలింది. ఈ నేపథ్యంలో ఆరు నెలలుగా రేషన్‌బియ్యం తీసుకోనివారు, ఇక్కడ రేషన్ కార్డు కలిగి ఉండి ఇతర రాష్ట్రాల్లో నివాసం ఉంటున్న వారి పేర్లను సేకరించారు. ఇలా జిల్లాలో 3,390 రేషన్ కార్డులను, 5,401 మంది లబ్ధిదారుల పేర్లను తొలగించారు. మరో 78 కార్డులకు సంబంధించిన సర్వే ప్రక్రియ సాగుతోంది.

మరో 6,459 కార్డులు పంపిణీకి సిద్ధం

జిల్లాలో రేషన్‌కార్డు దరఖాస్తులపై సర్వే పూర్తి చేసి దాదాపు 3,500 కొత్త కార్డులను సివిల్ సప్లై అధికారులు మంజూరు చేశారు. వారందరికీ రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఇంకా 6,459 కార్డులను అప్రూవల్ చేసి పంపిణీకి సిద్ధం చేశారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ నుంచి అనుమతి ఇస్తే ఆ కార్డులను కూడా పంపిణీ చేయనున్నారు. అప్రూవల్ చేసిన కార్డుల్లో కొత్తవాటితోపాటు, మార్పు చేర్పులు చేపట్టినవి కూడా ఉన్నాయి. రేషన్ కార్డులో పేరు తొలగింపునకు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, పేరు చేర్చాలంటే మీసేవలో దరఖాస్తు చేయాలని సివిల్ సప్లాయీస్ అధికారులు చెబుతున్నారు.

రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ



రేషన్‌కార్డుల జారీ, పేర్ల మార్పులు, చేర్పుల ప్రక్రియ నిరంతరం సాగుతుంది. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. జిల్లాలో మరో 6,459 కొత్త రేషన్ కార్డులు అప్రూవల్ దశలో ఉన్నాయి. రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి అనుమతి రాగానే లబ్ధిదారులకు కార్డులు జారీ చేస్తాం.

– రుక్మిణి, జిల్లా సివిల్ సప్లయీస్ అధికారి

మండలాల వారీగా రద్దయిన కార్డుల వివరాలు

మండలం	రద్దయినవి	సభ్యుల సంఖ్య
ఆళ్లపల్లి	49	109
అన్నపురెడ్డిపల్లి	65	105
అశ్వాపురం	150	224
అశ్వారావుపేట	552	749
భద్రాచలం	238	437
బూర్గంపాడు	274	420
చంద్రుగొండ	56	81
చర్ల	216	311
చుంచుపల్లి	63	111
దమ్మపేట	243	339
దుమ్ముగూడెం	263	388
గుండాల	65	133
జూలూరుపాడు	54	83
కరకగూడెం	35	49
కొత్తగూడెం	140	262
లక్ష్మీదేవిపల్లి	55	110
మణుగూరు	163	300
ములకలపల్లి	115	163
పాల్వంచ	214	346
పినపాక	121	179
సుజాతనగర్	38	80
టేకులపల్లి	76	148
ఇల్లెందు	145	274
మొత్తం	3,390	5,401

నేడు ప్రజావాణి

సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను లిఖితపూర్వకంగా దరఖాస్తులను అందజేయాలని కోరారు.

భక్తులతో పోటెత్తిన భద్రగిరి



స్వామివారి దర్శనానికి బారులుదీరిన భక్తులు

శ్రీసీతారామచంద్ర స్వామివారికి అభిషేకం, సువర్ణ పుష్పార్చన

భద్రాచలం: భద్రగిరి ఆదివారం భక్తులతో పోటెత్తింది. రెండో శనివారం, ఆదివారం వరుస సెలవులు రావడంతో భక్తులు భద్రాచలం బాట పట్టారు. పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి క్యూలైన్లలో బారులుదీరి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి నిత్యకల్యాణం, అభిషేకం తదితర పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రద్దీ ఉండటంతో పట్టణంలో ప్రైవేట్ లాడ్జీలలో, దేవస్థానం వసతి గృహాల్లో గదులు దొరకక భక్తులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు.

రామయ్యకు వైభవంగా కల్యాణం

అంతరాలయంలోని మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి స్వామివారిని పల్లకీ సేవగా చిత్రకూట మండపానికి తీసుకొచ్చారు. ఆ తర్వాత అర్చకులు స్వామివార్లకు విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.



స్వామివారి సన్నిధిలో ఎస్పీ రోహిత్ దంపతులు

స్వామివారి సేవలో ఎస్పీ

శ్రీ సీతారామ చంద్రస్వామివారిని ఎస్పీ రోహిత్ రాజు, మౌనిక దంపతులు దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకుని పూజలు చేశారు. శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారి ఉపాలయంలో పండితులు వేదాశీర్వచనం చేశారు. ప్రసాదాలను అందజేశారు.

గోర్‌బోలి భాషను అధికారికంగా గుర్తించాలి



అభివాదం చేస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: బంజారులు మాట్లాడే గోర్‌బోలి భాషను అధికారికంగా గుర్తించి 8వ షెడ్యూల్లో చేర్చాలని వక్తలు డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తగూడెం మార్కెట్ యార్డ్‌లో లంబాడీ (బంజారా) సంఘాల జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని సాధారణ సెలవు దినంగా ప్రకటించాలని, ట్రైకార్ రుణాలకు తక్షణమే నిధులు విడుదల చేయాలని కోరారు. ఐటీడీఏల్లో బ్యాక్ లాగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, వేంకటేశ్వర స్వామి ఆలయం ఉన్న ప్రతీ చోట భగవాన్ హతీరామ్ బావాజీ గుడి నిర్మించాలని డిమాండ్ చేశారు. టీటీడీ ట్రస్ట్ బోర్డు లాగే హతీరామ్ బావాజీ ట్రస్ట్ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు రాజేష్ నాయక్, ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్, బానోత్ రాములు నాయక్, హతిరామ్‌నాయక్, వీరూ నాయక్, వెంకట్ నాయక్, సీతారాంనాయక్, రవి నాయక్, లాల్ సింగ్ నాయక్, బాబులాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన పశు సంపద

- గత డిసెంబర్ నుంచి ఏప్రిల్ వరకు పశుగణన
- ఐదేళ్ల క్రితం సర్వే ప్రకారం జిల్లాలో 4.55 లక్షలు
- ఇటీవలి గణనలో తక్కువ ఉన్నట్లు తేలడంతో రీసర్వే



ఉల్వనూరులో రీ సర్వే నిర్వహిస్తున్న పశువైద్యాధికారులు (ఫైల్)



పాల్వంచరూరల్: ఐదేళ్లకోసారి నిర్వహించే జాతీయ పశుగణన ప్రక్రియ జిల్లాలో గత నెలలో ముగిసింది. తెల్ల పశువులు, గేదెలు, గొర్రెలు, మేకల సంఖ్య తగ్గిపోయినట్లు సర్వేలో వెల్లడైంది. దీంతో పశువులు ఎందుకు తగ్గాయి.? అందుకు గల కారణాలు, పరిస్థితులు తెలపాలంటూ కేంద్ర ప్రభుత్వం రీ సర్వేకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఈ నెల 1 నుంచి పదిరోజులపాటు జిల్లాలో పది మండలాల్లో పశుసంవర్ధక శాఖ అధికారులు రీ సర్వే నిర్వహించారు.

గత డిసెంబర్ నుంచి ఏప్రిల్ వరకు..

జాతీయస్థాయిలో ఐదేళ్లకోసారి పశుగణన నిర్వహిస్తుండగా చివరిసారిగా 2018–19 సంవత్సరంలో గణించారు. ఇప్పటివరకు 20 సార్లు పశుగణన చేపట్టారు. తాజాగా గతేడాది డిసెంబర్ 25 నుంచి ఏప్రిల్ వరకు పశుగణన సర్వే నిర్వహించారు. వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. జిల్లాలోని 23 మండలాల పరిధిలో 473 రెవెన్యూ గ్రామాల్లో 140మంది ఎన్యూమరేటర్లు, 30 మంది సూపర్‌వైజర్లు 2,91,273 నివాసాల్లో పశుగణన చేపట్టారు. గతంలో కంటే పశుసంపద బాగా తగ్గిందని సర్వేలో తేలింది.

35 శాతం వరకు తగ్గిన తెల్ల, నల్ల పశువులు

2018–2019లో సర్వే ప్రకారం జిల్లాలో 4.55 లక్షల పశువులు ఉన్నాయి. ఇందులో తెల్లపశువులు 2.80లక్షలు, నల్లపశువులు (గేదెలు) 1.70లక్షలు, మేకలు 2.50లక్షలు, గొర్రెలు 2.60 లక్షలు ఉన్నట్లు సర్వేలో వెల్లడైంది. కోళ్లు 3.27లక్షలు, నాటుకోళ్లు 1.38 లక్షలు, పందులు 3,180, కుక్కలు 30 వేలు ఉన్నట్లు నివేదికలో పేర్కొన్నారు. కానీ తాజా సర్వేలో తెల్లపశువులు 35–40శాతం, గేదెలు 30–35శాతం, గొర్రెలు 20–25శాతం, మేకలు 30శాతం, పెరటి కోళ్లు 35–40 శాతం తగ్గినట్లు తేలింది.

ఎందుకు తగ్గాయంటే..?

పశువుల సంఖ్య తగ్గడానికి కారణాలను కూడా విశ్లేషించారు. పోషణభారం కావడంతోపాటు పశువులను మేపే వారు తగ్గిపోవడం, బీడు భూములు లేకపోవడం, అటవీశాఖ అధికారులు ఫారెస్ట్‌లోకి పశువులు, మేకలు, గొర్రెలను రానివ్వకపోవడం, వ్యవసాయంలో యంత్రపరికరాల వినియోగం పెరగడం, ఇరిగేషన్ భూములు తగ్గిపోవడం వంటి కారణాల వల్ల పశువుల సంఖ్య తగ్గుముఖం పట్టినట్లుగా రీ సర్వేలో తేలింది.

పశువుల సంతతి తగ్గింది



జిల్లాలో 21వ జాతీయ పశుగణన ప్రక్రియ నిర్వహించారు. 20వ సర్వేలో తేలిన పశువుల సంఖ్య కంటే తాజా సర్వేలో తక్కువ సంఖ్యలో పశువులు ఉన్నట్లు తేలింది. కేంద్రం ఆదేశాలతో పాల్వంచ, చంద్రుగొండ, బూర్గంపాడు, అన్నపురెడ్డిపల్లి, అశ్వాపురం, కరకగూడెం, ములకలపల్లి, పినపాక, మణుగూరు, ఇల్లెందు మండలాల పరిధిలో రీ సర్వే నిర్వహించాం. వివరాలను పశుగణ్ యాప్‌లో ఆన్‌లైన్ చేస్తున్నాం.

– డాక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా పశువైద్యాధికారి

డివైడర్ల మధ్యలో మొక్కలు నాటాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

అశ్వారావుపేటరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని సత్తుపల్లి, జంగారెడ్డిగూడెం, భద్రాచలం మార్గాల్లో ప్రధాన రహదారుల మధ్యలో నిర్మిస్తున్న డివైడర్ల మధ్యలో మొక్కలు నాటాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఆదివారం ఉదయం అశ్వారావుపేట సమీపంలోని గంగారం వద్ద ఉన్న తన వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి వస్తూ కొద్దిసేపు ఆగారు. అక్కడే ఉన్న మున్సిపాలిటీ సిబ్బందితో మాట్లాడారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డైరెక్టర్

చర్ల: ఏజెన్సీ ప్రాంతాల్లో వచ్చే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్ సూచించారు. ఆదివారం ఆయన డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.జయలక్ష్మితో కలిసి మండలంలోని ఉంజుపల్లి పల్లె దవాఖానాను సందర్శించారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. సికిల్ సెల్ ఎనీమియా, టీబీ ముక్త్ భారత్, ఎన్‌సీడీ స్క్రీనింగ్, జ్వర పీడితుల గుర్తింపు తదితర వైద్య సేవలపై అధికారులు, సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రజల్లో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మధువరన్, చర్ల ప్రభుత్వ వైద్యశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ స్పందన, డాక్టర్ పుల్లారెడ్డి, డాక్టర్ తేజశ్రీ, ఉంజుపల్లి సబ్‌సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేగాను పరామర్శించిన కోనేరు కోనప్ప



రేగాతో మాట్లాడుతున్న కోనేరు కోనప్ప

కరకగూడెం: బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు తల్లి ఇటీవల మృతి చెందగా.. సిర్పూర్‌ కాగజ్‌నగర్‌ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆదివారం రేగాను పరామర్శించారు. ఆయన తల్లి నర్సమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకుముందు వివిధ పార్టీల నాయకులు కాంతారావును పరామర్శించారు.

వరద తగ్గింది.. బురద మిగిలింది



స్నానఘట్టాలపై చేరిన బురద

భద్రాచలంటౌన్‌: భద్రాచలం వద్ద గోదావరికి భారీ వరద వచ్చి తగ్గింది. సుమారు 42 అడుగులకు చేరుకోవడంతో స్నానఘట్టాలు పూర్తిగా వరద నీటిలో మునిగిపోయాయి. వరద తగ్గడంతో ఆదివారం కొంత మేరకు స్నానఘట్టాలపై నీరు తగ్గింది. కానీ బురద మిగిలిపోయింది. దీంతో స్నానాలు ఆచరించేందుకు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అక్కడక్కడా భక్తులే బురదను తొలగించుకుని స్నానాలు చేశారు.

నాటు కోళ్ల చోరీకి యత్నం

జూలూరుపాడు: మండల కేంద్రంలోని ఓ కోళ్ల ఫారంలోని నాటు కోళ్లను గుర్తు తెలియని యువకుడు చోరీ చేసేందుకు యత్నించిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. జూలూరుపాడుకు చెందిన ప్రభాకర్‌ తన వ్యవసాయ క్షేత్రంలో నాటు కోళ్లు పెంచుతున్నాడు. శనివారం మధ్యాహ్నం గుర్తుతెలియని యువకుడు కోళ్ల ఫారం షెడ్‌లోకి ప్రవేశించి కోళ్లు ఎత్తుకెళ్లేందుకు యత్నించాడు. సీసీ కెమెరాలు అమర్చిన విషయాన్ని గమనించకుండా ఐరన్‌ జాలీని తొలగించి లోపలికి ప్రవేశించి కోళ్లు ఎత్తుకెళ్లేందుకు యత్నించడంతో సీసీ కెమెరాల అలర్ట్‌ సైరన్‌ మోగింది. దీంతో యువకుడు పారిపోయాడు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదుచేసినట్లు యజమాని ప్రభాకర్‌ పేర్కొన్నాడు.

సింగరేణి హాస్టల్‌ వద్ద పడిగాపులు

సింగరేణి(కొత్తగూడెం): రామవరం సీఆర్‌పీ క్యాంపులోని సింగరేణి ఇంటర్మీడియట్‌ మహిళ వసతిగృహం వద్ద పిల్లలను చూసేందుకు వచ్చిన తల్లిదండ్రులు ఆదివారం పడిగాపులు కాశారు. హాస్టల్‌ వార్డెన్‌, మహిళా సెక్యూరిటీ గార్డులు యాజమాన్యం ఆదేశాలను బేఖాతరు చేస్తూ తల్లిదండ్రులను గంటల కొద్దీ ఎదురు చూసేలా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా, విద్యార్థులను చూసేందుకు వచ్చే తల్లిదండ్రులను ఒకరి తర్వాత ఒకరిని లోపలికి అనుమతించాలని యాజమాన్యం నిబంధనలు పెట్టినప్పటికీ సిబ్బంది పాటించడం లేదని, దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు సమాచారం. తల్లి లేదా తండ్రి ఒకరే విద్యార్థిని కలవాలని చెబుతున్నట్లు తెలిసింది.

పామాయిల్‌ గెలలు



టన్ను ధర	రూ.17,463

ఐటీఐల ఏర్పాటు కలేనా?



ఇల్లెందులో ఐటీఐ ఏర్పాటుకు పరిశీలించిన స్థలం

- ఐటీఐల్లో మొదటి విడత కౌన్సెలింగ్‌ పూర్తి
- ఇల్లెందు, అశ్వారావుపేటలో ఏర్పాటుపై నీలినీడలు
- ఏర్పాటైతే 200 మంది చొప్పున విద్యార్థులకు అవకాశం

ఇల్లెందు: జిల్లాలోని ఇల్లెందు, అశ్వారావుపేటలో ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ ఐటీఐలు ప్రారంభమయ్యే అవకాశాలు అడుగంటాయి. గత మార్చిలో రెండు ఐటీఐలు ప్రభుత్వం మంజూరు చేస్తూ జీఓ జారీ చేసి సౌకర్యాల కల్పనకు నిధులు కూడా విడుదల చేసింది. దీంతో కలెక్టర్‌ జితేశ్‌ వి.పాటిల్‌ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని భూమి ఎంపిక చేసి ప్రభుత్వం వద్దకు ఫైల్‌ పంపించారు. కానీ, సీసీఎల్‌ఏ నుంచి భూమి కేటాయించకపోవడంతో ఐటీఐలు ప్రారంభానికి నోచుకోలేదు. మొదటి విడత కౌన్సెలింగ్‌ గడువు కూడా ముగిసింది. దీంతో వృత్తి విద్య నేర్చుకోవాలనుకున్న ఈ ప్రాంత విద్యార్థుల్లో నైరాశ్యం నెలకొంది.

కార్యరూపం దాల్చలేదు..

విద్యా సంవత్సరం ప్రారంభమైనా ఐటీఐల ఏర్పాటు ప్రక్రియ కార్యరూపం దాల్చ లేదు. ఆరు నెలల కిందట అధికారులు, ప్రజా ప్రతినిధులు హడావుడి చేశారు. భూమి గుర్తించారు. ఆ తర్వాత ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. జేకే ఏరియాలోని నూతన గ్రంథాలయ వద్ద నాన్‌వెజ్‌ మార్కెట్‌ స్థలం కేటాయించారు. గత మార్చి 10వ తేదీన జిల్లా కలెక్టర్‌ జితేశ్‌ వి.పాటిల్‌, ఎమ్మెల్యే కోరం కనకయ్య, సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం వీసం కృష్ణయ్య స్థలం పరిశీలించారు. మార్చి 13న తహసీల్దార్‌ నుంచి కలెక్టర్‌కు స్థలం కేటాయిస్తూ లేఖ అందజేయగా జిల్లా కలెక్టర్‌ నుంచి మార్చి 15న స్పెషల్‌ చీఫ్‌ సెక్రటరీకి పంపించారు.

సీసీఎల్‌ఏలో నిలిచిన ఫైల్‌

హైదరాబాద్‌లో సీసీఎల్‌ఏలో ఐటీఐలకు సంబంధించిన ఫైల్‌ నిలిచిపోయింది. ఐటీఐలకు స్థలం కేటాయిస్తూ సీసీఎల్‌ఏ నుంచి ఆదేశాలు అందితే ఇక్కడ ఐటీఐ ప్రారంభం అయినట్లేనంటున్నారు. భూమి కేటాయింపు జరుగనంత కాలం అనుమతి లభించదంటున్నారు. తక్షణం భూమి కేటాయించేలా ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచటమే మార్గం అంటున్నారు. కాగా, జిల్లాలో మరో పాలిటెక్నిక్‌ కాలేజీ కృష్ణసాగర్‌లో మంజూరు కాగా భూమి కేటాయింపు సమస్యగా మారింది. పాలిటెక్నిక్‌ కళాశాల కోసం 10 ఎకరాల స్థలం ఎంపిక చేశారు. నిధులు కూడా మంజూరై భూమి కేటాయింపు ఆదేశాలు అందితే ప్రారంభం అయ్యే అవకాశం ఉండేది.

ఐటీఐ వస్తే ఐదు ట్రేడ్లు

ఇల్లెందు ఐటీఐలో ఐదు ట్రేడ్‌లతో 200 మందితో ఏర్పడనున్న ఐటీఐ వల్ల ఈ ప్రాంత విద్యార్థులకు సాంకేతిక విద్య విద్య అందుతుంది. ప్రతీ ట్రేడ్‌లో 40 మంది విద్యార్థులకు అవకాశం ఉంది. ఎలక్ట్రీషియన్‌ కోర్సులో రెండేళ్లు 2 యూనిట్లు 40 మంది విద్యార్థులు, ఫిట్టర్‌లో రెండేళ్లు 2 యూనిట్లు 40 మంది విద్యార్థులు, ఐఓటీ స్మార్ట్‌ అగ్రికల్చర్‌లో ఏడాది, 2 యూనిట్లు 40 మంది విద్యార్థులు, ఫ్యాషన్‌ డిజైనర్‌ టెక్నాలజీలో ఏడాది 2 యూనిట్లు 40 మంది విద్యార్థులు, మెకానిక్‌ ఎలక్ట్రిక్‌ వెహికల్‌ కోర్సు ఏడాది 2యూనిట్లు 40 మంది విద్యార్థులు ఉండేలా చర్యలు చేపట్టారు. కృష్ణసాగర్‌ ఐటీఐ నుంచి ఇన్‌చార్జ్‌ వైస్‌ ప్రిన్సిపాల్‌ను కూడా కేటాయించారు.

ఇంకా అనుమతి రాలేదు..

ఐటీఐ ప్రారంభించేందుకు ప్రభుత్వం నంచి అనుమతి రాలేదు. మొదటి విడత కౌన్సెలింగ్‌ ప్రక్రియ కూడా పూర్తయింది. రెండో విడత కౌన్సెలింగ్‌ తేదీ కూడా త్వరలో రాబోతుంది. అప్పటికైనా అనుమతి లభిస్తే ప్రారంభించే అవకాశం ఉంటుంది.
–జి.వెంకటేశ్వర్లు, వైస్‌ ప్రిన్సిపాల్‌, ఇల్లెందు ఐటీఐ

ఈ ఏడాదే ప్రారంభించాలి..



ఇల్లెందు, అశ్వారావుపేట ఐటీఐలు, కృష్ణసాగర్‌లోని పాలిటెక్నిక్‌ కాలేజీలు ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలి. విద్యార్థులు సాంకేతిక విద్య కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. అధికారులు ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి.
–భయ్యా అభిమన్యు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు

కాంగ్రెస్‌ హయాంలోనే ప్రతిపాదనలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

- ఎమ్మెల్యే జారె ఆదినారాయణ
- పంప్‌హౌస్‌–2 వద్ద ప్రత్యేక పూజలు

ములకలపల్లి: సీతారామ ఎత్తిపోతల పథకం (ఎస్‌ఆర్‌ఎల్‌పీ) డిజైన్‌ చేసిన బీఆర్‌ఎస్‌ హయాంలో డిస్ట్రిబ్యూటర్‌ కెనాళ్ల ఊసేలేదని, కాంగ్రెస్‌ హయాంలో ప్రత్యేకంగా కాల్వల ప్రతిపాదనలు రూపొందించామని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ వెల్లడించారు. దీనిని విస్మరించి ఆదే పార్టీ ఆధ్వర్యంలో భద్రాద్రి జిల్లాకు నీళ్లు ఇవ్వాలని బీఆర్‌ఎస్‌ ఆందోళన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నెస్పీ కాల్వకు నీటి తరలింపు నేపథ్యంలో, బీజీ కొత్తూరు నుంచి గోదావరి జలాలు మండలంలోని వీకే రామవరం శివారులోని పంప్‌హౌస్‌–2కు చేరాయి. ఆదివారం పంప్‌హౌస్‌–2 ద్వారా నీళ్లు ఎత్తిపోయగా, డిశ్చార్జ్‌ పాయింట్‌ వద్ద గోదావరి జలాలకు ఎమ్మెల్యే పూజలు చేసి, మాట్లాడారు. ప్రాజెక్ట్‌ ద్వారా అశ్వారావుపేట నియోజకవర్గంలోని 1.39 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తామని తెలిపారు. ఈ ఏడాది ములకలపల్లి మండలంలో 15,200 ఎకరాలు, చండ్రుగొండలో 16,750, అన్నపురెడ్డిపల్లి మండలంలో 12,560 ఎకరాలకు సాగు నీరందిస్తామని, వచ్చే జూన్‌ నాటికి అశ్వారావుపేటలో 29 వేలు, దమ్మపేటలో 46 వేల ఎకరాలకు సాగు నీరందిస్తామని వివరించారు.

మొరాయించిన మోటార్లు

పంప్‌హౌస్‌–2 మోటార్లు కొంతసేపు మొరాయించడంతో ఇరిగేషన్‌ అధికారులు హైరానా పడ్డారు. రెండుసార్లు ట్రయల్‌ వేసినా ట్రిప్‌ అయింది. మూడోమారు ఆన్‌ చేయడంతో విజయవంతగా నీళ్లు ఎత్తి పోశాయి. 15 కి.మీ. దూరంలోని కమలాపురంలోని పంప్‌హౌస్‌–3కి రాత్రి 8.30 గంటలకు నీరు చేరుకుంది. కాగా, మండలంలోని వీకే రామవరం పంప్‌హౌస్‌–2 నుంచి గోదావరి జలాలు దిగువకు పరవళ్లు తొక్కుతున్నాయి. బీజీ కొత్తూరు నుంచి ఇక్కడికి గోదావరి జలాలు గ్రావిటీ ద్వారా వస్తున్న క్రమంలో లీకుల ద్వారా వృథాగా పోతున్నాయి. ఇలా భారీగా లీకేజీలు బయటపడి నీరంతా పోతుండటంతో క్రమేపీ కట్టకు ప్రమాదం ఉంటుందని పలువురు సందేహిస్తున్నారు. నాణ్యతాలోపం వల్లే ఇలాంటివి తలెత్తుతున్నాయని, అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

భూ వివాదాలను న్యాయపరంగా పరిష్కరించుకోవాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందురూరల్‌: గ్రామంలో భూ వివాదాలు ఉంటే న్యాయపరంగా పరిష్కరించుకోవాలే తప్ప స్థానికంగా పెద్దమనుషులు పంచాయతీ చేయడం చట్టవిరుద్ధమని డీఎస్పీ చంద్రభాను స్పష్టం చేశారు. కుల బహిష్కరణ ఆరోపణల నేపథ్యంలో ఆదివారం మండలంలోని పాతపూసపల్లి, కొత్తపూసపల్లి గ్రామాల్లో ఆయన గ్రామసభ నిర్వహించి విచారణ చేశారు.

రెండు గ్రామాల్లో గ్రామపెద్దలు, ఆరోపించిన కుటుంబాలు, ఆరోపణలు ఎదుర్కొంటున్న పెద్దమనుషులను అంశాల వారీగా ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. రెండు కుటంబాల మధ్య చోటుచేసుకున్న భూ వివాదం మనస్పర్థలకు దారి తీసి సమస్యాత్మకంగా మారిందని గుర్తించారు. ఈ విషయంలో పంచాయతీ నిర్వహించిన పెద్దలు సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేసినప్పటికీ జఠిలంగా మారిందని తెలుసుకున్నారు. కుల బహిష్కరణ జరగలేదని నిర్ధారించుకున్న ఆయన భవిష్యత్‌లో ఇలాంటి ఆరోపణలకు అవకాశం ఇవ్వకుండా గ్రామపెద్దలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ప్రస్తుతం నెలకొన్న భూవివాదాన్ని కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి, పాతపూసపల్లి, కొత్త పూసపల్లి గ్రామపెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

మార్కెట్‌ కార్మికుల చార్జీలు పెంపు



ఖమ్మం మార్కెట్‌లో పనిచేస్తున్న కార్మికులు

ఈ నెల 22 నుంచి 13 శాతం పెంపు అమలు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పనిచేసే కార్మికుల చార్జీలు 13 శాతం పెరిగాయి. రెండేళ్లకు ఒకసారి మార్కెట్‌ కార్మికుల రేట్ల పెంపుపై నూతన ఒప్పందం ఉంటుంది. కార్మిక సంఘాల ప్రతినిధులు పెరిగిన నిత్యావసరాలు, ఇతర అవసరాలకు అనుగుణంగా తమకు రేట్లు పెంచాలని ఖమ్మం చాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ ప్రతినిధి వర్గానికి, ఖమ్మం మార్కెట్‌ కమిటీకి నోటీసులు ఇచ్చారు. ఈ నోటీసుల ఆధారంగా ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ కమిటీ, చాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌, రైతు సంఘాల ప్రతినిధులు, కార్మిక సంఘాల ప్రతినిధులతో రెండుసార్లు సమావేశాలు నిర్వహించారు. ఈ ఏడాది మిర్చి ధర తగ్గినందున కార్మికుల రేట్ల పెంపును విరమించుకోవాలని రైతు సంఘాలు ప్రతిపాదించాయి. ఈ అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకొని కార్మికులు అభ్యర్థించిన రేట్ల పంపును పరిశీలించి 13 శాతం పెంచుతున్నట్లు నిర్ణయించారు. మార్కెట్‌లో హమాలీలు, దడవాయిలు, స్వీపర్లు, రెల్లుడు వంటి కార్మిక విభాగాలు పనిచేస్తాయి. ఆయా కార్మికులుకు గతంలో నిర్ణయించిన రేట్లపై 13 శాతాన్ని పెంచారు. పత్తి, పంటలు బోరాల్లో నింపితే అదనంగా చార్జి చెల్లించాల్సి ఉంటుంది. గింజలు పెట్టడం, ధాన ధర్మాలు(ముష్టి) వంటి విధానాలు పూర్తిగా నిషేధించారు. ఖమ్మం చాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ దిగుమతి శాఖ పర్యవేక్షణలో ఈ నూతన రేట్లు అమలు కానున్నాయి. రైతుల పంటను ఖరీదుదారులకు విక్రయించటంలో మధ్యవర్తులుగా వ్యవహరించే కమీషన్‌దారులు నూతన కార్మికుల రేట్లు అమలు చేయాల్సి ఉంటుంది. పెంచిన 13 శాతం రేట్లు మార్కెట్‌లో పనిచేసే సుమారు 2,500 మంది కార్మికులకు వర్తించే అవకాశం ఉంది.

పెరిగిన కార్మికుల రేట్లు ఒక బస్తాకు(రూ.లలో)

పంట	దిగుమతి	తట్టపోత	దడవాయి	రెల్లుడు	స్వీపర్‌	మొత్తం
అపరాలు	4.22	15.11	6.11	3.02	4.07	32.52
శనగకాయ	4.22	8.00	6.11	3.02	4.07	25.41
పత్తి, మిర్చి						
50 కేజీలలోపు	4.22	10.05	6.11	--	2.53	22.91
50 కేజీల పైన	4.22	15.11	6.11	--	2.53	27.97

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఇల్లెందురూరల్‌: మండలంలోని బొజ్జాయిగూడెం గ్రామ పంచాయతీ మోదుగులగూడెం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తగూడెం పెనగడపకు చెందిన యోగేంద్ర తీవ్రంగా గాయపడ్డాడు. పెనగడప నుంచి హైదరాబాద్‌కు కారులో బయలుదేరిన యోగేంద్ర ఎదురుగా వచ్చిన లారీని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు 108లో యోగేంద్రను ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి అక్కడి నుంచి ఖమ్మంకు తరలించారు.

వివాహిత అదృశ్యం

టేకులపల్లి: ఆషాఢ మాసానికి వచ్చిన నవ వధువు కనిపించకుండా పోయిన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. బోడు ఎస్‌ఐ పొడిశెట్టి శ్రీకాంత్‌ కథనం ప్రకారం.. మండలంలోని బోడు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన యువతికి ఇల్లెందు మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడితో ఈ ఏడాది మేలో వివాహమైంది. 15 రోజుల కిందట ఆషాఢ మాసానికి యువతి పుట్టింటికి వచ్చింది. శనివారం ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదు. తల్లిదండ్రులు అన్ని చోట్లా వెతికినా ఫలితం లేకపోవడంతో ఆదివారం యువతి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

రేకుల షెడ్డు దగ్ధం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే జారే

దమ్మపేట: ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ప్రమాదవశాత్తు రేకుల షెడ్డు దగ్ధమైన ఘటన మండలంలోని పట్వారిగూడెంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సీతారాములు తన కుటుంబంతో అదే గ్రామంలో రేకుల షెడ్డులో నివాసం ఉంటున్నాడు. ఆదివారం తన భార్యతో కలిసి కూలీ పనులకు వెళ్లగా.. వారి కుమారుడు (5) ఇంటికి సమీపంలో ఆడుకుంటున్నాడు. సాయంత్రం ఒక్కసారిగా రేకుల షెడ్డుకు మంటలు అంటుకున్నాయి. గమనించిన స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేయగా, అప్పటికే ఇంట్లో ఉన్న వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5,000 తక్షణ ఆర్థిక సహాయంగా అందజేశారు.

కారు బోల్తా

ఇద్దరికి గాయాలు



బోల్తా పడిన కారు

అశ్వారావుపేటరూరల్‌: అదుపుతప్పి ఓ కారు బోల్తా పడిన ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. భద్రాచలం నుంచి అశ్వారావుపేట వైపు వస్తున్న కారు మండలంలోని ఆసుపాక సమీపంలో గేదె అడ్డురావడంతో అదుపుతప్పి బోల్తా పడింది. కారులోని భద్రాచలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కాగా, ఈ ప్రమాదంలో కారు పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటనపై ఫిర్యాదు రాలేదని స్థానిక ఎస్‌ఐ యయాతిరాజు తెలిపారు.

నగరాలు, పట్టణాలకు నిధులు..

- కార్పొరేషన్‌, మున్సిపాలిటీలకు విడుదల చేస్తూ జీఓ
- స్వచ్ఛభారత్‌ మిషన్‌ కింద మంజూరు
- టాయిలెట్లు, భవనాల నిర్వహణకు వినియోగం
- కేఎంసీకి రూ.3.71 కోట్లు..

ఖమ్మంమయూరిసెంటర్‌ : నిధులు లేక నిర్వహణలో ఇబ్బంది పడుతున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. నగరాలు, పట్టణాలకు స్వచ్ఛభారత్‌ మిషన్‌ (అర్బన్‌) 2.0 కింద 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి నిధులు విడుదల చేస్తూ సీడీఎం, స్టేట్‌ మిషన్‌ డైరెక్టర్‌ ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపాలిటీల్లో టాయిలెట్లు, భవనాల నిర్వహణ, బయోమైనింగ్‌ పనులకు ఈ నిధులను వినియోగించుకునేలా వీలు కల్పిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఖమ్మం, కొత్తగూడెం మున్సిపల్‌ కార్పొరేషన్లతో పాటు మధిర, మణుగూరు, సత్తుపల్లి, వైరా, ఇల్లెందు మున్సిపాలిటీలకు ఈ నిధులు విడుదల చేశారు. పాల్వంచ మున్సిపాలిటీ కొత్తగూడెం కార్పొరేషన్‌లో విలీనం కావడంతో ఆ పట్టణ నిధులను కూడా కొత్తగూడెం కార్పొరేషన్‌కు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు.



కార్పొరేషన్‌, మున్సిపాలిటీల వారీగా కేటాయించిన నిధులు(రూ.ల్లో) ..

ఖమ్మం కార్పొరేషన్‌	3,71,38,950
కొత్తగూడెం కార్పొరేషన్‌	99,17,851
మధిర	6,11,112
మణుగూరు	5,86,721
సత్తుపల్లి	6,13,720
వైరా	5,72,508
ఇల్లెందు	8,17,360

మెరుగుపడనున్న సౌకర్యాలు..

మున్సిపాలిటీలకు సరైన నిధులు లేక, ఆదాయం రాక కార్యాలయ భవనాల నిర్వహణ, టాయిలెట్ల నిర్వహణ అంతంతమాత్రంగానే ఉంటోంది. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదాయ వనరులు తగ్గడంతో మున్సిపాలిటీలపై భారం పెరిగింది. ఈ తరుణంలో ప్రభుత్వం స్వచ్ఛ భారత్‌ మిషన్‌ కింద నిధులు విడుదల చేయడంతో మున్సిపాలిటీల్లో సౌకర్యాలు మెరుగయ్యే అవకాశం ఉంది.

బయోమైనింగ్‌కు నిధులు..

పట్టణాలు, నగరాలు విస్తరిస్తుండడం, జనాభా పెరగడంతో వ్యర్థాల నిర్వహణ మున్సిపాలిటీలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఖమ్మం మున్సిపల్‌ కార్పొరేషన్‌లో వ్యర్థాల డంపింగ్‌ పెద్ద సమస్యగా మారింది. ఈ సమస్యకు చెక్‌పెట్టేందుకు కేఎంసీ అధికారులు బయోమైనింగ్‌ నిర్వహిస్తున్నారు. దీంతో దశాబ్దాలుగా పేరుకుపోయిన వ్యర్థాలను శుభ్రం చేస్తున్నారు. బయోమైనింగ్‌ నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులను కేటాయించింది. ఖమ్మం మున్సిపల్‌ కార్పొరేషన్‌కు రూ.3.71 కోట్లుకు పైగా ఎస్‌బీఎం కింద నిధులను కేటాయించగా.. ఇందులో రూ.3,35,62,783 బయోమైనింగ్‌కు కేటాయిస్తు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇక కొత్తగూడెం కార్పొరేషన్‌కు రూ.99.17 లక్షల నిధులు విడుదల చేయగా.. బయోమైనింగ్‌ కోసం రూ.76,65,007 కేటా యించారు. ఇల్లెందు మున్సిపాలిటీకి రూ.8,17,360 మంజూరు కాగా, బయోమైనింగ్‌కు రూ.1,36,924 కేటాయించారు.